సాక్షి
మంచిర్యాల
సోమవారం। 4। డిసెంబర్। 2023


ముల్కల్లలో ఎల్ఈడీ తెరపై ఫలితాలు వీక్షిస్తున్న స్థానికులు

‘హస్త’గీతం...


కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ


పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది


చెన్నూర్‌లో విజయోత్సవ ర్యాలీలో వివేక్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

- జిల్లాలోని అన్ని స్థానాల్లో ఘనవిజయం
- ప్రేంసాగర్‌రావు, వివేక్, వినోద్ గెలుపు
- ఘోర పరాజయం పాలైన సిట్టింగులు
- కాంగ్రెస్ పార్టీలో జోష్ నింపిన రిజల్ట్స్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా ఓటర్లు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీని చావుదెబ్బ కొట్టారు. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్ (జన్నారం)స్థానాల్లోనూ అన్నింటా కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేసింది. జిల్లాలో బీఆర్ఎస్ సర్కారుపై ఉన్న ప్రజావ్యతిరేకత స్పష్టంగా వెల్లడైంది. ఓట్ల లెక్కింపులో మొదటిరౌండ్ నుంచే కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్ల ఆధిక్యత ఉండడం, ఏ పోలింగ్ కేంద్రంలోనూ కనీస ఓట్లు రాక అన్ని చోట్లా అధికార పార్టీ చతికిలపడింది. 2009, 2014, 2018 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన నాటి టీఆర్ఎస్ నేటి బీఆర్ఎస్ కనీస ఓట్లు రాబట్టలేక బొక్కబోర్లా పడింది. వరుసగా నాలుగుసార్లు గెలిచిన దివాకర్‌రావు, 2004లో కాంగ్రెస్, మిగతా మూడుసార్లు ‘కారు’ గుర్తుపైనే గెలిచారు. ఇక బెల్లంపల్లిలో 2014, 2018లో వరుసగా గెలిచిన చిన్నయ్య ఈసారి హ్యాట్రిక్ అందుకోలేకపోయారు. చెన్నూర్‌లో 2009, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా హవా కొనసాగించిన టీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసింది.

ఓట్లు రాల్చని పథకాలు

బీఆర్ఎస్ ప్రభుత్వ జనరంజక పథకాలు తమకు ఓట్లు రాల్చుతాయని అభ్యర్థులు భారీ ఆశలు పెట్టుకున్నారు. వీటిలో ప్రధానంగా రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, కల్యాణలక్ష్మి, ఆసరా, దళిత, మైనార్టీ, బీసీ బంధు పథకాల లబ్ధిదారులు లక్షల్లో ఉన్నారని అంచనా వేశారు. ఎన్నికల ముందు కూడా లబ్ధిదారులను తమ ఓటర్లుగా చూపించుకున్నారు. జిల్లాలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో ఎన్నికల సభల్లో ఈ పథకాల పైనే ప్రచారం చేశారు. ఈ పథకాలతో జిల్లాలో అందరూ తమకే ఓట్లు వేస్తారని నమ్మారు. అయితే జిల్లాలో ఏ స్థానంలోనూ కనీస పోటీ ఇవ్వలేక బీఆర్ఎస్ అభ్యర్థులు ఘోర ఓటమి పాలయ్యారు.

ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత

సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మరోసారి టికెట్లు ఇచ్చిన పార్టీ అధిష్ఠానం మళ్లీ గెలుస్తారనే ఆశలు పెట్టుకుంది. అయితే వరుస గెలుపులతో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు పట్టపగ్గాలు లేకుండా పోయాయి. చెన్నూర్‌లో బాల్క సుమన్, బెల్లంపల్లిలో దుర్గం చిన్నయ్య, వారి అనుచరులపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. చెన్నూర్ బీఆర్ఎస్ నాయకుల భూకబ్జాలు, దందాలు, సింగరేణిలో మితిమీరిన జోక్యమే కొంప ముంచినట్లుగా చెప్పుకొంటున్నారు. సొంత కార్యకర్తలు, నాయకులు ఆయన తీరుతో విసిగిపోవడంతో అధికార మార్పు కోరుకున్నారు. అయితే చెన్నూర్‌లో వందల కోట్ల అభివృద్ధి చేశామని, పదే పదే వల్లె వేసినా చివరకు ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థికే పట్టం కట్టారు. గులాబీ పార్టీకి కంచుకోటగా ఉన్న చెన్నూర్ గడ్డ నేడు గడ్డం వివేక్‌కు జై కొట్టింది.

మంచిర్యాలలో పుంజుకున్న కమలం

గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి బీజేపీ మంచిర్యాల నియోజకవర్గంలో పుంజుకోవడం కమలనాథుల్లో జోష్ పెంచింది. 2018 ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీ చేసిన వెరబెల్లి రఘునాథ్‌కు 5,018ఓట్లు రాగా, ఈసారి 39,370 ఓట్లు పోలయ్యాయి. అధికార పార్టీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కంటే 1,636 ఓట్లు ఎక్కువగా తెచ్చుకుని రఘునాథ్ తమ పార్టీకి ఓటర్లున్నారంటూ తెలిపారు. అయితే ముందునుంచి ఆ పార్టీకి పెద్దగా ఓటు బ్యాంక్ లేదనే అభిప్రాయాలున్నాయి. అయితే ఈసారి బరిలో ఉన్న అభ్యర్థి భారీగా ఖర్చు చేసుకోవడంతో ఈ మేరకు ఓట్లు దక్కినట్లుగా పలువురు చెప్పుకొంటున్నారు. కేంద్ర మంత్రి అమిత్‌షా రోడ్ షో జిల్లా కేంద్రంలో కలిసి వచ్చింది. ఇక పోలింగ్ రెండు, మూడ్రోజుల ముందు చేసిన వ్యూహంలో భారీగా డబ్బులు ఖర్చు చేసుకోగా ఆశించిన ఓట్లు తెచ్చిపెట్టినట్లుగా తెలుస్తోంది. బీజేపీకి ఒక వర్గంలోనే ఆదరణ ఉంటుందని భావించినా, ఈ ఎన్నికల్లో మాత్రం దండేపల్లి నుంచి మొదలు, నస్పూర్ దాకా ప్రతీ పోలింగ్ కేంద్రంలో కొంత మేర ఓట్లు పడ్డాయి.

ముల్కల్లలో సందడి

- ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడంతో జనసంద్రమైన గ్రామం
- మార్మోగిన కాంగ్రెస్ నినాదాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గత నెల 30న జరిగిన మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ అసెంబ్లీ ఎన్నికల లెక్కింపును ఆదివారం హాజీపూర్ మండలంలోని ముల్కల్ల ఐజా కళాశాలలో చేపట్టారు. దీంతో జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, స్వతంత్రులు, అభిమానులు ముల్కల్ల బాట పట్టారు. జాతీయ రహదారికి ఇరువైపులా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. ఈ ప్రాంతంలోని హోటళ్లు, వివిధ దుకాణాలన్నీ కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం దాకా గ్రామంలో ఎటు చూసినా, ఏ వీధి చూసినా జనసందడి కనిపించింది. ఫలితాల్లో జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల అభ్యర్థులు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, గడ్డం వివేక్ వెంకటస్వామి, వనోద్ ఘనవిజయం సాధించడంతో గ్రామమంతా ఆ పార్టీ నినాదాలతో మార్మోగింది. సాయంత్రం ఫలితాలు తేలిపోగా గ్రామం ఖాళీ అయింది.

ప్రజాతీర్పు గౌరవిస్తా: సుమన్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్

చెన్నూర్: ప్రజాతీర్పును గౌరవిస్తానని ఓటమి చెందిన బీఆర్ఎస్ చెన్నూర్ అభ్యర్థి బాల్క సుమన్ పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలలోని ఐజా కళాశాలలో జరిగిన ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద 14వ రౌండ్ తర్వాత ఆయన బయటకు వెళ్తూ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ నియోజకవర్గ అభివృద్ధిని కొనసాగించాలని కోరారు. పార్టీ కోసం కష్టపడ్డ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. విజయం సాధించిన వివేక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజావిశ్వాసాన్ని నిలుపుకొంటా

– బెల్లంపల్లి విజేత గడ్డం వినోద్



బెల్లంపల్లి: ప్రజలు తనపై పెట్టుకున్న విశ్వాసాన్ని నిలుపుకొంటానని బెల్లంపల్లి అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన గడ్డం వినోద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మంచిర్యాల కౌంటింగ్ కేంద్రం వద్ద మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుకు కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్‌పై నమ్మకముంచి ప్రజలు తనను గెలిపించారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాను బెల్లంపల్లిలోనే ఇల్లు కట్టుకుని నివాసముంటానని స్పష్టం చేశారు. మంత్రి పదవి గురించి అధిష్ఠానం చూసుకుంటుందని పేర్కొన్నారు. తన విజయానికి కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తా

- మంచిర్యాల విజేత ప్రేంసాగర్‌రావు



మంచిర్యాలటౌన్: ప్రజా ఆశీర్వాదంతోనే తాను 66,116 ఓట్ల మెజార్టీతో గెలిచానని మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో తాను ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. తాను గత ఎన్నికల్లో ఓడిపోయినా ఐదేళ్లుగా ప్రజల మధ్యలోనే ఉన్నానని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ఇందుకు వారి పనితీరే కారణమన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంతో పాటు, ప్రజలు కోరుకునే పాలన అందిస్తామని భరోసా ఇచ్చారు.

మోడ్రన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- చెన్నూర్ విజేత వివేక్ వెంకటస్వామి



చెన్నూర్: చెన్నూర్‌ను మోడ్రన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. ఆదివారం అసెంబ్లీ ఫలితాలు వెలువడిన అనంతరం విజేతగా నిలిచి గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. చెన్నూర్ గెలుపు ప్రజల విజయమని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతానని చెప్పారు. అభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన సాగుతుందని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి తదితరులున్నారు.

బెల్లంపల్లిలో వినోద్ విజయం



వినోద్‌కు ధ్రువీకరణ పత్రం ఇస్తున్న ఆర్వో రాహుల్

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ భారీ మెజార్టీతో గెలుపొందారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై 36,878 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. నియోజకవర్గంలో 1,73,335 మంది ఓటర్లుండగా వీరిలో 1,41,863 మంది ఓటు వినియోగించుకున్నారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో దుర్గం చిన్నయ్యకు 45,339 ఓట్లు రాగా, వినోద్ 82,217 ఓట్లు తెచ్చుకుని తిరుగులేని మెజార్టీ సొంతం చేసుకున్నారు. గట్టి పోటీ ఇస్తారని భావించిన బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి 3,812 ఓట్లతోనే సరిపెట్టుకున్నారు. మిగతా 10 మంది స్వతంత్రులు 2,500 లోపు ఓట్లు తెచ్చుకుని పోటీలో నిలువలేకపోయారు. నోటాకు 2,179 ఓట్లు పడ్డాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1,042 రాగా, వీటిలో శ్రీదేవికి 61 ఓట్లు, వినోద్‌కు 775, చిన్నయ్యకు 176 ఓట్లు పోలయ్యాయి. ఇతరులు 30 ఓట్లు తెచ్చుకున్నారు.

తొలిరౌండ్ నుంచే ఆధిక్యత చాటిన వినోద్

17 రౌండ్లుగా ఓట్లు లెక్కించగా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ తొలిరౌండ్ నుంచే ఆధిక్యత చాటారు. ప్రతీ రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్యపై పైచేయి సాధిస్తూ వచ్చారు. రౌండ్‌ల వారీగా మెజార్టీ పెంచుకుంటూ భారీ ఆధిక్యతతో గెలుపు వాకిట నిలిచారు. 13మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేయగా వీరిలో అధికార బీఆర్ఎస్ అభ్యర్థితో సహా మరే అభ్యర్థి సరైన పోటీ ఇవ్వలేక చతికిలపడ్డారు. అన్ని రౌండ్లలోనూ వినోద్ ఆధిక్యతను ప్రత్యర్థి అభ్యర్థులు నిలువరించలేక పోయారు. ప్రత్యర్థుల అంచనాలకు అందకుండా వినోద్ విజయాన్ని సునాయసంగా కైవసం చేసుకున్నారు.

రౌండ్ల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు

రౌండ్	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
1	4,493	2,456	323
2	5,679	3,334	207
3	4,413	2,324	100
4	6,237	2,294	293
5	5,818	2,702	164
6	4,830	2,541	482
7	5,729	2,705	540
8	6,752	2,982	355
9	4,962	2,644	239
10	4,610	2,168	175
11	4,698	2,737	187
12	4,574	3,110	129
13	3,268	2,597	101
14	4,078	3,277	131
15	4,702	3,142	163
16	5,398	3,109	138
17	1,201	1,041	24

మంచిర్యాలలో ‘కొక్కిరాల’ పాగా

- మొదటి రౌండ్ నుంచే ఆధిక్యం
- భారీ మెజార్టీతో ఘన విజయం
- రెండో స్థానంలో నిలిచిన బీజేపీ
- మూడోస్థానంలో ఎమ్మెల్యే నడిపెల్లి


నృత్యం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు ధ్రువీకరణపత్రం తీసుకుంటున్న కొక్కిరాల

నియోజకవర్గంలోని ఓటర్లు: 2,75,141
ఓటు వేసినవారి సంఖ్య: 1,91,568
కాంగ్రెస్ అభ్యర్థికి వచ్చిన ఓట్లు: 1,05,945
బీజేపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లు: 39,829
బీఆర్ఎస్ అభ్యర్థికి వచ్చిన ఓట్లు: 37,989
నోటాకు పడిన ఓట్ల సంఖ్య: 942
రిజెక్టు అయిన ఓట్ల సంఖ్య: 108
కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల మెజార్టీ: 66,116

మంచిర్యాలటౌన్: నియోజకవర్గంలో మొదటిరౌండ్ నుంచే కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ, ఆఖరి రౌండ్ ముగిసేసరికి 66,116 ఓట్ల అత్యధిక మెజార్టీతో ఘన విజయం సాధించారు. పోస్టల్ బ్యాలెట్ నుంచి 21వ రౌండ్ వరకు ప్రతీ రౌండ్‌లోనూ ఆధిక్యాన్ని ప్రదర్శించారు. బీజేపీ అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లి రెండో స్థానంలో నిలువగా, బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మూడో స్థానానికి పరిమితమయ్యారు. 21 రౌండ్లు ముగిసేసరికి కాంగ్రెస్ అభ్యర్థి ప్రేంసాగర్‌రావు బీజేపీ అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లిపై 66,116 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అనంతరం ప్రేంసాగర్‌రావు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాములు చేతుల మీదుగా గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకున్నారు.

పోస్టల్ బ్యాలెట్ నుంచే ముందంజ

నియోజకవర్గంలో 287 పోలింగ్ కేంద్రాలుండగా, 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. 2,561 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 1,685, బీజేపీకి 459, బీఆర్ఎస్‌కు 255 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనే కాంగ్రెస్ 1,226 ఓట్ల ఆధిక్యాన్ని సాధించింది. కాగా, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ఫలితాలు సాయంత్రం దాకా ప్రకటించకపోవడం గమనార్హం. 10 రౌండ్లు ముగిసేసరికి కాంగ్రెస్ అభ్యర్థి ప్రేంసాగర్‌రావుకు 29,786 ఓట్ల మెజార్టీ రాగా, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు నడిపెల్లి దివాకర్‌రావు, రఘునాథ్ వెరబెల్లి కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయారు.

అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు

మంచిర్యాల స్థానానికి 17మంది అభ్యర్థులు పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రేంసాగర్‌రావుకు 1,05,945 ఓట్లు రాగా, బీఎస్పీ అభ్యర్థి తోట శ్రీనివాస్‌కు 1,280, బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావుకు 37,989, బీజేపీ అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లికి 39,829 ఓట్లు వచ్చాయి. ధర్మ సమాజ్ పార్టీకి చెందిన ఎదునూరి రమేశ్‌కు 246, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి పోటీ చేసిన గొర్లపల్లి సురేశ్‌కు 164, బహుజన రిపబ్లికన్ సోషలిస్ట్ పార్టీ అభ్యర్థి చెరుకూరి శాంతిశ్రీకి 136, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి దొమ్మటి రవికుమార్‌కు 128, స్వతంత్ర అభ్యర్థులు అందె మంగకు 169, ఎండీ ఇఫ్తాకర్ అహ్మద్‌కు 295, ఎం.కృష్ణకు 218, తాళ్లూరి వెంకటేశ్వర్లుకు 334, నహీమ్ పాషా ఎండీకి 636, ప్రణయ్ గంగారెడ్డికి 1,054, రంగు మల్లేశంకు 515, సొల్లు సందీప్‌కు 1,890, హనుమాండ్ల శంకర్‌కు 740 ఓట్లు వచ్చాయి.

రౌండ్ల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

రౌండ్	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్	ఆధిక్యం
1	5,144	1,948	1,743	3,196
2	4,076	2,180	1,641	1,896
3	4,475	2,635	1,634	1,840
4	5,615	2,440	1,916	3,175
5	4,996	1,765	2,692	2,304
6	4,757	2,185	2,086	2,548
7	4,733	2,264	2,021	2,469
8	6,130	1,291	2,435	3,695
9	5,176	1,359	1,877	3,299
10	4,957	2,062	2,129	2,828
11	4,072	2,475	1,787	1,597
12	4,479	1,509	1,524	2,955
13	5,637	2,531	2,046	3,106
14	5,291	1,982	1,616	3,309
15	5,960	2,675	2,024	3,285
16	5,711	1,706	2,159	3,552
17	5,031	1,246	1,533	3,498
18	4,253	1,162	1,129	3,091
19	5,788	1,301	1,500	4,288
20	4,709	1,578	1,250	3,131
21	3,270	1,175	893	2,095
22	1,685	459	255	1,226

వివేక్ ‘చేతి’కి చిక్కిన చెన్నూర్


కార్యకర్తలు, కుటుంబ సభ్యులతో కలిసి విజయ చిహ్నం చూపిస్తున్న వివేక్

- తొలిరౌండ్ నుంచి కాంగ్రెస్ ఆధిక్యత
- భారీ మెజార్టీతో వివేక్ విజయం
- అధికార బీఆర్ఎస్‌కు రెండోస్థానం

చెన్నూర్: చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గం హస్తగతమైంది. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామికి 87,541 ఓట్లు రాగా, సమీప బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు 50,026 ఓట్లు వచ్చాయి. వివేక్ వెంకటస్వామి సుమన్‌పై 37,541 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. మొదటి రౌండ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ అధిక్యత ప్రదర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ మొదటి రౌండ్ నుంచే రెండో స్థానానికి పరిమితమయ్యారు. బీజేపీ అభ్యర్థి 3,375 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఇతరులకు 9,496, నోటాకు 1,792 ఓట్లు వచ్చాయి.

రౌండ్‌ల వారీగా పార్టీలకు వచ్చిన ఓట్లు

రౌండ్	కాంగ్రెస్	బీఆర్ఎస్	కాంగ్రెస్ మెజార్టీ
1	6,134	3,046	3,088
2	11,642	5,828	5,814
3	16,157	8,407	7,744
4	21,842	11,404	10,438
5	26,123	14,083	12,040
6	30,759	17,189	13,570
7	36,560	20,988	15,578
8	42,673	24,301	18,372
9	47,022	27,124	19,898
10	52,835	29,456	23,382
11	57,978	32,254	25,724
12	63,080	35,692	27,724
13	69,108	39,058	30,050
14	74,525	42,185	32,340
15	80,134	45,795	34,339
16	85,334	49,165	36,169
17	87,541	50,026	37,515

తూర్పున కాంగ్రెస్, పశ్చిమాన కమలం

- మధ్య ప్రాంతంలో బీఆర్ఎస్‌కు గెలుపు
- పోటీలో ఉన్న ఎమ్మెల్యేలందరికీ ఓటమే
- గెలిచిన వారిలో కొత్తవారే అధికం
- ఉమ్మడి జిల్లా ఎన్నికల ఫలితాల్లో వైవిధ్యం


సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటర్లు విభిన్న తీర్పుతో ఈ ఎన్నికల్లో తమ వైవిధ్యాన్ని చాటారు. తూర్పున కాంగ్రెస్ హవా కొనసాగగా, పశ్చిమ జిల్లాలో కమలం వికసించింది. మధ్యలో కారు ప్రయాణం సాగింది. మొత్తంగా ఈ ఎన్నికల్లో పది అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీ వైపు ఎక్కువ మొగ్గు చూపకుండా ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలకు సమన్యాయం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఎన్నికల చరిత్రలో బీజేపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు ఎవరూ లేరు. 2019ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా సోయం బాపూరావు గెలిచారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పెద్దగా ప్రభావం చూపలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా నాలుగు స్థానాల్లో బీజేపీ పాగా వేయడం గమనార్హం.

కలిసొచ్చిన ముక్కోణ పోటీ..

నిర్మల్, ఆదిలాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ముక్కోణ పోటీ నెలకొంది. నిర్మల్‌లో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి (బీజేపీ), అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి(బీఆర్ఎస్), కూచాడి శ్రీహరిరావు(కాంగ్రెస్) మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు సమంగా ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ వ్యతిరేక ఓట్లు చీలిపోయాయి. చివరికి బీజేపీ బయటపడింది. సిర్పూర్‌లో బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ బరిలో ఉండడంతో ఇక్కడ బీఆర్ఎస్, బీజేపీతోపాటు బీఎస్పీ ఓట్లు పంచుకున్నాయి. ముథోల్‌లో బీఆర్ఎస్‌కు మైనార్టీ ఓట్లు కలిసి రాగా, ఇక్కడ కాంగ్రెస్ ఆశించిన ఓట్లు రాబట్టలేక పోవడంతో మిగతా వర్గం ఓట్లు బీజేపీ వైపు మళ్లాయి. ఆదిలాబాద్‌లోనూ బీజేపీ, బీఆర్ఎస్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. 6వేల మెజార్టీతో బయటపడ్డారు. ఇక్కడ కూడా కాంగ్రెస్ మూడో స్థానంలో నిలిచింది. మొదట బోథ్ స్థానంలోనూ బీజేపీ గట్టిపోటీ ఇచ్చింది. ఇక్కడ బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ నిలిచింది. ఎంపీ సోయం బాపూరావు బరిలో ఉండడంతో ఆ పార్టీ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. చివరకు బీఆర్ఎస్ 22వేల మెజార్టీ సాధించింది.

ఎస్టీ స్థానాల్లో బీఆర్ఎస్

పది స్థానాల్లో ఎనిమిది చోట్ల చతికిల పడ్డ బీఆర్ఎస్ మూడు ఎస్టీ స్థానాల్లో బోథ్, ఆసిఫాబాద్ బీఆర్ఎస్ గెలిచి పరువు నిలబెట్టుకుంది. గత ఎన్నికల్లో ఆసిఫాబాద్‌లో స్వల్ప తేడాతో ఓడిపోయిన కోవ లక్ష్మీ, సిట్టింగ్ ఎమ్మెల్యే బాపురావు కాదని అనిల్ జాదవ్‌కు అవకాశం ఇస్తే, గెలిచారు. ఈ మూడు స్థానాల్లో ఖానాపూర్ మాత్రం కాంగ్రెస్ గెలుచుకుంది. గత ఎన్నికల్లో తొమ్మిది స్థానాలు



అప్పటి టీఆర్ఎస్‌కు రాగా ఆసిఫాబాద్ ఎస్టీ స్థానం మాత్రమే కాంగ్రెస్‌కు వచ్చింది. ఇక్కడ ఈసారి బీఆర్ఎస్ గెలుచుకుంది.

అసెంబ్లీకి కొత్త ముఖాలు

రెండో ప్రయత్నంలో ముథోల్ నుంచి రామారావు పాటిల్ గెలిచి తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు. సిర్పూర్ నుంచి పాల్వాయి హరీశ్ బాబు, ఆదిలాబాద్ నుంచి పాయల్ శంకర్, బోథ్ నుంచి అనిల్ జాదవ్, ఖానాపూర్ నుంచి వెడ్మ బొజ్జు, మంచిర్యాల నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, మాజీ ఎంపీ వివేక్ తొలిసారిగా శాసనభకు ఎన్నికయ్యారు. మాజీ మంత్రి వినోద్, కోవ లక్ష్మి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గతంలో ఎమ్మెల్యేలుగా గెలిచారు.

సిట్టింగ్‌ల ఓటమి

పది మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఓడిపోయారు. నిర్మల్‌లో సీనియర్ నాయకులు, మంత్రి ఐకేరెడ్డి, నాలుగుసార్లు గెలిచిన మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగు రామన్న, ముథోల్‌లో విఠల్‌రెడ్డి, సిర్పూర్‌లో కోనప్ప, బెల్లంపల్లి చిన్నయ్య, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సుమన్ ఘోర ఓటమి చవి చూశారు. ఖానాపూర్, బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు రేఖానాయక్, రాథోడ్ బాపురావు, ఆత్రం సక్కుకు బీఆర్ఎస్ నుంచి టికెట్లు రాకపోవడంతో పోటీకి దూరంగా ఉన్నారు.

క్లుప్తంగా

హత్య కేసులో నిందితుడి రిమాండ్


నిందితుడు రాజశేఖర్‌గౌడ్

భీమిని(బెల్లంపల్లి): మండలంలోని కేస్లాపూర్‌లో శుక్రవారం రాత్రి బొడ్డు జలేందర్ అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన ముత్యం రాజశేఖర్‌గౌడ్ కత్తితో పొడిచి హత్య చేశాడు. మృతుని భార్య బొడ్డు శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెల్లంపల్లి ఏసీపీ సదయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి సాక్ష్యాధారాలతో హత్యకు పాల్పడిన రాజశేఖర్‌ను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకు సహకరించిన వారి వివరాలు సేకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి విద్యార్థిని మృతి


ఊర్వశి (ఫైల్)

జైనూర్(ఆసిఫాబాద్): ప్రమాదవశాత్తు బావిలో పడి విద్యార్థిని మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పారా గ్రామానికి చెందిన కుమ్ర ఊర్వశి (19) మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి చేనులో పత్తి తీయడానికి వెళ్లింది. దాహం వేయడంతో సమీపంలో ఉన్న బావివద్దకు వెళ్లింది. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందింది. మృతురాలి తండ్రి కుమ్ర ఈశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా యువకుడు హైదరాబాద్‌లో హత్య!

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీలోని గొల్లపల్లికి చెందిన వెంకటేశ్ ఆదివారం హైదరాబాద్‌లో హత్యకు గురయ్యాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లపల్లికి చెందిన వెంకటేశ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడే ఉంటున్న హాజీపూర్‌కు చెందిన దంపతులతో వెంకటేశ్‌కు చనువు పెరిగింది. వారింట్లోనే కొద్ది రోజులు ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలో ఆ ఇంటి మహిళతో పరిచయం మరింత దగ్గర కావడంతో ఇరువురి మధ్య సాన్నిహిత్యం చూసి అనుమానం వచ్చిన ఆమె భర్త వెంకటేశ్‌ను పథకం ప్రకారం హత్య చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై హైదరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా నిందితుడిని రిమాండ్ చేసినట్లు తెలిసింది.

డిపాజిట్లు గల్లంతు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలో పోటీ చేసిన ప్రధాన పార్టీలు మినహా మిగతా అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. నియోజకవర్గంలో 17 మంది అభ్యర్థులు పోటీ చేయగా 14 మంది డిపాజిట్ కోల్పోయారు. బీఎస్పీ నుంచి పోటీ చేసిన తోట శ్రీనివాస్‌కు 1,280 ఓట్లు, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి అదునూరి రమేశ్‌కు 246 ఓట్లు, విద్యార్థి రాజకీయ పార్టీ అభ్యర్థి గొర్లపల్లి సురేశ్‌కు 164 ఓట్లు, బహుజన రిపబ్లిక్ సోషలిస్టు పార్టీ అభ్యర్థి చెరుకూరి శాంతిశ్రీకి 136 ఓట్లు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి దొమ్మటి రవికుమార్‌కు 128 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థులు అండె మంగకు 169 ఓట్లు, ఎండి ఇఫ్తికార్ అహ్మద్‌కు 295 ఓట్లు, ఎం.కృష్ణకు 218 ఓట్లు, తల్లూరి వెంకటేశ్వర్లుకు 334 ఓట్లు, నహీం పాషాకు 636 ఓట్లు, ప్రణయ్ గంగారెడ్డికి 1,054 ఓట్లు, రంగు మల్లేశంకు 515 ఓట్లు, సొల్ల సందీప్‌కు 1,890 ఓట్లు, హనుమాండ్ల శంకర్‌కు 740 ఓట్లు వచ్చాయి. నోటాకు 942 ఓట్లు రాగా కేవలం బీఎస్పీ అభ్యర్థితో పాటు, ప్రణయ్, సందీప్‌లు మాత్రమే నోటా కంటే ఎక్కువ ఓట్లు సాధించినా డిపాజిట్ మాత్రం కోల్పోయారు.

సింగరేణి 'హస్త'గతం

- 11 స్థానాలకు 9 కాంగ్రెస్ కైవసం
- చేతికి జై కొట్టిన కార్మికులు
- కారుకు చుక్కెదురు
- ఒక్కో స్థానంలో బీఆర్ఎస్, సీపీఐ
- ఫలితాలపై కేటీఆర్ విస్మయం

కోల్‌బెల్ట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో నేటి ఎన్నికల ఫలితాలు

నియోజకవర్గం	పార్టీ	అభ్యర్థి పేరు
ఆసిఫాబాద్	బీఆర్ఎస్	కోవ లక్ష్మి
బెల్లంపల్లి	కాంగ్రెస్	గడ్డం వినోద్
చెన్నూర్	కాంగ్రెస్	గడ్డం వివేక్
మంచిర్యాల	కాంగ్రెస్	ప్రేంసాగర్‌రావు
రామగుండం	కాంగ్రెస్	మక్కాన్ సింగ్
మంథని	కాంగ్రెస్	శ్రీధర్‌బాబు
భూపాలపల్లి	కాంగ్రెస్	సత్యనారాయణ
కొత్తగూడెం	సీపీఐ	సాంబశివరావు
ఇల్లందు	కాంగ్రెస్	కనుకయ్య
పినపాక	కాంగ్రెస్	వెంకటేశ్వర్లు
సత్తుపల్లి	కాంగ్రెస్	రాఘుమయి


మందమర్రి మార్కెట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ

శ్రీరాంపూర్(మంచిర్యాల): రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి క్షేత్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పూర్తిగా కాంగ్రెస్‌కు అనుకూలంగా వచ్చాయి. కారుకు చుక్కెదురైంది. సింగరేణి ఓటర్లు గంపగుత్తగా కాంగ్రెస్‌కు జై కొట్టారు. తెలంగాణలోని 6 జిల్లాల్లో సింగరేణి విస్తరించి ఉంది. ఆయా జిల్లాల్లోని 11 అసెంబ్లీ స్థానాల్లో సింగరేణి, కాంట్రాక్ట్ కార్మికులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఓట్లు అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తాయి. మరో రెండు స్థానాలు స్వల్పంగా ప్రభావితం అవుతాయి. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 11 స్థానాలకు 9 స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. కేవలం ఆసిఫాబాద్ మాత్రమే గులాబీ పార్టీకి దక్కింది. ఇదిలా ఉంటే 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 6 స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోగా 3 స్థానాలను బీఆర్ఎస్, మిగిలిన ఒక్క స్థానాన్ని టీడీపీ గెలుచుకుంది.

వాకిట్లో సింగరేణి ఎన్నికలు..

మరికొద్ది రోజుల్లోనే సింగరేణిలో 7వ దఫా గుర్తింపు సంఘం ఎన్నికలు జరగనున్నాయి. హైకోర్టు ఆదేశాల మేరకు డిసెంబర్ 27న ఎన్నికలు నిర్వహించడానికి డెప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్, రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 4న హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులతో ఎన్నికలపై సమావేశం నిర్వహిస్తున్నారు. ఆదివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సింగరేణి ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సింగరేణిలో ప్రస్తుత గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌తో ఇన్నాళ్లు పోటీపడుతూ వస్తున్న కాంగ్రెస్ అనుబంధ సంఘం ఐఎన్‌టీయూసీ, సీపీఐ అనుబంధ కార్మిక సంఘం ఏఐటీయూసీకి ఈ అసెంబ్లీ ఎన్నికలు కొత్త ఉత్సాహాన్ని నింపాయి. కార్మికవర్గం అంతా కూడా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఈ ఎన్నికల్లో తీర్పునిచ్చిన నేపథ్యంలో ఇక సింగరేణి ఎన్నికల్లో ఫలితాలు కూడా తమకే అనుకూలంగా ఉంటాయని ఈ రెండు సంఘాల నేతలతో పాటు హెచ్‌ఎంఎస్ నాయకులు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై మంత్రి కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సందర్భంలో సింగరేణిని ఉద్దేశించి సింగరేణి గనులను ప్రైవేటుపరం కాకుండా ఆపాం.. సంస్థ లాభాల్లో కూడా కార్మికులకు 32 శాతం వాటా ఇవ్వడంతో పాటు అనేక హక్కులు కల్పించినా చేదు ఫలితాలే వచ్చాయంటూ వాపోయిన సంగతి తెలిసిందే.

కష్టానికి గుర్తింపు



సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలను గెలిపించుకోవడం కోసం తమపార్టీ నేతలు, కార్యకర్తలు విశ్రాంతి లేకుండా కష్టపడ్డారు. ఎవరు ఎంత మభ్యపెట్టినా కార్మికులు కూడా కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. ఇదే స్ఫూర్తితో సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేస్తాం.

– బీ.జనక్‌ప్రసాద్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్

నోటాకు ఓటేశారు..!

- ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 17327
- బోథ్ నియోజకవర్గంలో అత్యధికం

ఎన్నికల్లో నోటాకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	2014 ఎన్నికలు	2018 ఎన్నికలు	2023 ఎన్నికలు
సిర్పూర్	1752	1579	2196
చెన్నూర్	1609	2135	1792
బెల్లంపల్లి	769	2598	2179
మంచిర్యాల	1472	1394	942
ఆసిఫాబాద్	2829	2715	1515
ఖానాపూర్	2421	2776	2114
ఆదిలాబాద్	850	1149	592
బోథ్	2242	2275	2565
నిర్మల్	1360	1367	1526
ముథోల్	1791	2266	1906



కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నోటాకు ఓటేసిన వారి సంఖ్య ఈ ఎన్నికల్లో కాస్త తగ్గింది. చట్టసభలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలకమైనది. ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం వంటిది. కానీ.. ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిలో అభ్యర్థులందరూ అందరికీ ఆమోదయోగ్యులై ఉండాలని ఏమీ లేదు. గతంలో నచ్చని అభ్యర్థులు బరిలో ఉన్న చోట్ల ఓటర్లు ఎవరికో ఒకరికి ఓటు వేయడం, మరికొందరు ఓటింగ్‌కు దూరంగా ఉండడం జరిగేది. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈవీఎం బ్యాలెట్లలో నోటా(నన్ ఆఫ్ ద ఎబోవ్) బటన్ తీసుకొచ్చారు. ఇది కేవలం ఓటరుకు ఐచ్ఛికం మాత్రమే. అభ్యర్థులు ఎవరూ సరైన వారు లేరని భావించిన పక్షంలో నోటాకు ఓటు వేయవచ్చు. నోటాకు పోలయ్యే ఓట్లు అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేయవు. అత్యధికంగా నోటాను వినియోగించుకున్నా పోలైన ఓట్లలో మెజార్టీ ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. 2014అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాల్లో 17,095 మంది ఓటర్లు నోటా బటన్ నొక్కారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 20,254 ఓట్లు నోటాకు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో 17,327 మంది నోటాకు ఓటేశారు. బోథ్ నియోజకవర్గంలో అత్యధికంగా నోటాకు వేశారు.

ఇలా ఈవీఎంల్లోకి..

2013లో పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఆధారంగా నోటాను ప్రవేశపెట్టారు. దీన్ని భావ వ్యక్తీకరణలో అంతర్భాగంగానే పరిగణించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. తొలిసారిగా ఢిల్లీ, మిజోరాం, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 2013 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో నోటా ఐచ్ఛికాన్ని ప్రవేశపెట్టారు. అన్ని గుర్తులకంటే చివరలో నోటా గుర్తు ఉంటుంది. ఈ గుర్తును అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ సంస్థ రూపొందించింది.

స్వతంత్రుల కన్నా ఎక్కువ

బోథ్: బోథ్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులు, చిన్న పార్టీల అభ్యర్థులు సాధించిన ఓట్ల కన్నా నోటాకు ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. నోటాకు 2565 మంది నోటాను వినియోగించుకున్నారు. బీఎస్పీ అభ్యర్థి జంగుబాపుకు 2044 ఓట్లు, బీసీపీ పార్టీ అభ్యర్థి ఆడె సునీల్ నాయక్‌కు 677, ఆర్‌జేపీ అభ్యర్థి హీరాజీకి 1388, డీఎస్పీ అభ్యర్థి ఉమేష్‌కు 1011, జీజీపీ అభ్యర్థి బాదు నైతంకు 596, స్వతంత్ర అభ్యర్థులు భోజ్యా నాయక్‌కు 878, ధనలక్ష్మికి 1231 ఓట్లు పోల్ అయ్యాయి.

చిన్నయ్యను చిత్తుగా ఓడించిన వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ విజయం సాధించి ప్రత్యర్థి అభ్యర్థి దుర్గం చిన్నయ్యను చిత్తు చేశారు. 2018 ఎన్నికల్లో చిన్నయ్య చేతిలో ఓడి పోయిన వినోద్ ప్రస్తుత ఎన్నికల్లో చిన్నయ్యను ఓడించి పైచేయి సాధించారు. 2018 ఎన్నికల్లో వినోద్ బీఎస్పీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. కేవలం రెండు వారాల గడువు ఉండగా ఎన్నికల తెరపై కనిపించారు. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఆశించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. మద్దతుదారుల వొత్తిడితో చివరిదశలో వినోద్ బీఎస్పీ టికెట్ తెచ్చుకుని పోటీ చేశారు. ఎన్నికల ప్రచారానికి అతి తక్కువ సమయం ఉన్నప్పటికీ తనదైన శైలిలో ప్రచారం చేసి ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న చిన్నయ్యకు గుబులు రేపారు. అయితే ఆ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన చిన్నయ్య 55,026 ఓట్లు తెచ్చుకుని విజయం సాధించారు. వినోద్‌కు 43,750 ఓట్లు వచ్చాయి. చిన్నయ్యకు 11,276 ఓట్ల ఆధిక్యత వచ్చింది. ఈ దఫా జరిగిన ఎన్నికల్లో చిన్నయ్యపై వినోద్ ఓటమి బాకీని తీర్చుకున్నాడు. ఏకంగా 82,217 ఓట్లు సాధించి చిన్నయ్యను పరాజయం పాల్జేశాడు. చిన్నయ్యకు కేవలం 45,339 ఓట్లురాగా వినోద్ 36,878 ఓట్ల మెజార్టీని కైవసం చేసుకున్నాడు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు ప్రజల విజయం

- జెడ్పీచైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి


మాట్లాడుతున్న నల్లాల భాగ్యలక్ష్మి

మందమర్రిరూరల్(చెన్నూర్): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు ప్రజల విజయమని జెడ్పీచైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం ఫలితాలు వెలువడిన అనంతరం ఆమె పార్టీ శ్రేణులకు, చెన్నూర్ ప్రజలకు, ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మిఠాయిలు పంపిణీ చేశారు. నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వివేక్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవడం అభినందనీయమని, ప్రజాభీష్టం మేరకే కాంగ్రెస్ పాలన ఉంటుందన్నారు.

అన్నిచోట్లా కాంగ్రెస్‌దే మెజారిటీ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులకు వారి సొంత ప్రాంతాల్లో, వారు ఓటు వేసిన పోలింగ్ బూత్‌లలో బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు అనుకున్నంతగా మెజార్టీని సాధించలేక పోయారు. వారు పుట్టిన, పెరుగుతున్న ప్రాంతంలో మాత్రం అంతగా ప్రభావం చూపలేకపోయారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసిన నడిపెల్లి దివాకర్‌రావు సొంత గ్రామం పాతమంచిర్యాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఉండగా నాలుగింటిలోనూ కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ వచ్చింది. పాతమంచిర్యాలలోని 167 పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్‌కు 66 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 403, 168 పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్‌కు 155రాగా కాంగ్రెస్‌కు 643 ఓట్లు, 169 పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్‌కు 243 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 722 ఓట్లు, 170 పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్‌కు 291 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 623 ఓట్లు వచ్చాయి. అక్కడే మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ బీఆర్ఎస్‌కు చెందిన పెంట రాజయ్య నివాసం ఉంటున్నాడు. ప్రస్తుతం దివాకర్‌రావు నివాసం ఉంటున్న ఎల్‌ఐసీ కాలనీ సమీపంలో ఓటుహక్కు వినియోగించుకున్న 174వ పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్‌కు 178 ఓట్లు రాగా బీజేపీకి 227, కాంగ్రెస్‌కు 317 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, బీజేపీ అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లి నివాసం ఉంటున్న హైటెక్‌సిటీ కాలనీకి సంబంధించిన పోలింగ్ కేంద్రం 138లో వారిద్దరూ ఓటుహక్కు వినియోగించుకోగా కాంగ్రెస్‌కు 382 ఓట్లు, బీజేపీకి 273 ఓట్లు, బీఆర్ఎస్‌కు 154 ఓట్లు వచ్చాయి.

'గడ్డం' బ్రదర్స్ జోష్!

- వరుస ఓటముల తర్వాత గెలుపు
- కాంగ్రెస్‌లోనే వినోద్, వివేక్‌కు అదృష్టం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మాజీ కేంద్ర మంత్రి, దివంగత గడ్డం వెంకటస్వామి(కాకా) వారసులైన గడ్డం సోదరులకు ఈ ఎన్నికలు కలిసొచ్చాయి. ఒకేసారి వినోద్, వివేక్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి రికార్డు సృష్టించారు. గత ఎన్నికల్లో బెల్లంపల్లి నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన అన్న వినోద్ 11వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. తాజాగా బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్యపై గెలిచి, 2009తర్వాత మళ్లీ కాంగ్రెస్ పార్టీతోనే విజయం అందుకున్నారు. ఇక తమ్ముడు వివేక్ 2009లో పెద్దపల్లి లోక్‌సభ నుంచి గెలిచి 2014వరకు ఎంపీగా కొనసాగారు. తర్వాత బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మారి, చివరకు గత నెల 1న సొంత గూటికి చేరారు. మొదటి నుంచి ఎమ్మెల్యే స్థానానికి పోటీకి అయిష్టతను ప్రదర్శిస్తూనే చివరకు బరిలో నిలిచారు. నెల రోజుల వ్యవధిలోనే టికెట్, ప్రచారం పూర్తి చేసి తన పాత ప్రత్యర్థి, బాల్క సుమన్‌ను ఓడించి ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ఎన్నికల ప్రచార సమయంలోనే ఈ ఇద్దరన్నదమ్ములపై ఈడీ, ఐటీ దాడులు జరిగాయి.

చెన్నూర్‌లో వివేక్ విజయోత్సవ ర్యాలీ

చెన్నూర్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థి వివేక్ వెంకటస్వామి ఆదివారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జలాల్ పెట్రోల్ బంక్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్ శ్రేణులు సంబరాల మధ్య ర్యాలీ కొనసాగింది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, నాయకులు మైదం రవి, గొడిసెల బాపురెడ్డి, ఫయాజ్, సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్, రవికుమార్‌గౌడ్, పిట్టల రవి, అంబాటి శంకర్, తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వివేక్

ప్రజల తీర్పును గౌరవిస్తా


ఓడిపోయాక ఇంటికి వెళ్తున్న శ్రీదేవి

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానని బెల్లంపల్లి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమురాజుల శ్రీదేవి అన్నారు. ఆదివారం ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కోట్ల రూపాయల డబ్బులు ఖర్చు పెట్టాయని, తాను సాదాసీదా ప్రచారం సాగించానన్నారు. ప్రజల నమ్మకాన్ని పొందలేకపోవడం కొంత బాధకలిగించిందన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయినా ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానన్నారు. సమస్యలపై పోరాడుతానన్నారు.

వార్షికోత్సవాల వేళ వారసత్వం కొనసాగిద్దాం..

- మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ నెల 8వ వరకు నిర్వహించనున్న ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం 23వ వార్షికోత్సవాల వేళ అమరుల త్యాగాలను పునికిపుచ్చుకుని వారి త్యాగాల వారసత్వాన్ని కొనసాగిద్దామని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు పార్టీ) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఆదివారం విడుదల చేసిన లేఖలో పిలుపునిచ్చారు. రాజ్యాధికారం కోసం విప్లవం ప్రజా ఆయుధంగా ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం ఆవిర్భవించిందని గుర్తు చేస్తూ దోపిడి, బానిసత్వం నుంచి ప్రజలను విముక్తి చేయడానికి ఎంతో కృషి చేసిందన్నారు. సింగరేణి, పట్టణ ప్రాంతాల్లో ఈ వార్షిక సంబరాలు విప్లవోత్సాహంతో జరుపుకోవాలని సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ పిలుపునిస్తుందని ప్రకటనలో పేర్కొన్నారు.

కౌంటింగ్‌కు గైర్హాజరైన చిన్నయ్య


దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య డుమ్మా కొట్టారు. ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థిగా దుర్గం చిన్నయ్య ఎన్నికల ప్రచారం సాగించారు. ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వినోద్‌తో నువ్వా? నేనా? అనే రీతిలో ఎన్నికల ప్రచారం చేసి హోరెత్తించారు. ముచ్చటగా మూడోసారి సైతం విజయం సాధిస్తాననే భరోసాతో ఉన్న చిన్నయ్య చివరికి ఓట్ల లెక్కింపునకు గైర్హాజరయ్యారు. పార్టీ శ్రేణులను కౌంటింగ్‌కు పంపించినా మూడోరౌండ్ పూర్తయ్యేసరికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వినోద్ ఆధిక్యతతో దూసుకెళ్తుండడంతో చిన్నయ్య ఓడిపోవడం తథ్యమని భావించి మెల్లగా కౌంటింగ్ కేంద్రం నుంచి జారుకున్నారు. కారణాలేంటో తెలియదు కానీ చిన్నయ్య కౌంటింగ్‌కు రాకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

14 నుంచి కోలిండియా హాకీ పోటీలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గు పరిశ్రమల్లో ఎంతో ప్రతిష్టాత్మకమైన కోలిండియా హాకీ పోటీలకు ఈసారి సింగరేణి ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నెల 14 నుంచి 17 వరకు శ్రీరాంపూర్ డివిజన్ నస్పూర్ నాగార్జున కాలనీలోని సింగరేణి మైదానంలో కోలిండియా హాకీ పోటీలు జరగనున్నాయి. సింగరేణితో పాటు దేశ వ్యాప్తంగా కోలిండియా పరిధిలోని వివిధ సబ్సిడరీ కంపెనీల నుంచి 10 టీంలు పోటీల్లో పాల్గొననున్నాయి. దీని కోసం కంపెనీ ఈ మైదానంలో పోటీలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. పోటీల కోసం ఇటీవలే మైదానం కూడా చదును చేసి సుందరంగా తీర్చిదిద్దారు. నాలుగు రోజులుగా సింగరేణి జట్టు క్రీడాకారులు ప్రాక్టీస్ చేస్తున్నారు.


ప్రాక్టీస్ చేస్తున్న సింగరేణి హాకీ జట్టు

రోడ్డు రోలర్ గుర్తుకు ఓట్లు

మంచిర్యాలటౌన్: బీఆర్ఎస్ పార్టీకి చెందిన కారు గుర్తును పోలి ఉన్న రోడ్డు రోలర్ గుర్తుపై మంచిర్యాల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన సొల్ల సందీప్‌కు మిగతా స్వతంత్ర అభ్యర్థుల కంటే అధికంగా ఓట్లు పడ్డాయి. బీఆర్ఎస్ పార్టీకి సీరియల్ నంబర్‌లో 3 కేటాయించగా స్వతంత్ర అభ్యర్థి సందీప్‌కు 16వ నంబర్‌ను కేటాయించారు. రెండింటి మధ్యలో 13 మంది పేర్లు ఉన్నా, రోడ్డు రోలర్ గుర్తు కారును పోలి ఉండడంతో 1,890 ఓట్లు రాగా బీఆర్ఎస్ పార్టీకి 37,989 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్ల తరువాత నాలుగోస్థానంలో రోడ్డు రోలర్ గుర్తు కలిగిన సందీప్‌కు ఎక్కువ ఓట్లు రావడం గమనార్హం.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని జీఎం రవిప్రసాద్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారులకు క్రీడాపోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం మాట్లాడుతూ ఆత్మస్థైర్యంతో ఎంతటి విజయాన్నయినా సొంతం చేసుకోవచ్చన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం విద్యా, ఉపాధి రంగాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం క్రీడాపోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు సుజాతను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, పర్సనల్ మేనేజర్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న జీఎం రవిప్రసాద్

కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు


ర్యాలీలో పాల్గొన్న వినోద్

బెల్లంపల్లి: పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవ సంబరాలు నిర్వహించాయి. బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ ఘన విజయం సాధించడంతో పట్టణంలో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మునిమంద రమేశ్, స్వరూప, మల్లయ్య, పొట్ల సురేష్, దావ రమేశ్ పాల్గొన్నారు.

అప్పుడు సుమన్.. ఇప్పుడు వివేక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 2014లో జరిగిన పార్లమెంట్ టీఆర్ఎస్ పార్టీ నుంచి బాల్క సుమన్, కాంగ్రెస్ పార్టీ నుంచి గడ్డం వివేక్ వెంకటస్వామి పోటీ చేశారు. బాల్క సుమన్‌కు 5,65,496 ఓట్లు రాగా వివేక్‌కు 2,74,338 ఓట్లు వచ్చాయి. 2,91,159 ఓట్ల తేడాతో బాల్క సుమన్ భారీ గెలుపు సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరూ అదే పార్టీల నుంచి చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేశారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్‌కు 50,016 ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వివేక్ వెంకటస్వామికి 87,529 ఓట్లు వచ్చాయి. 37,513 ఓట్ల భారీ మెజార్టీతో వివేక్ గెలుపొందారు. ఎంపీ ఎన్నికల్లో సుమన్‌ని విజయం వరించగా ఎమ్మెల్యే ఎన్నికల్లో వివేక్ వెంకటస్వామిది పైచేయి అయ్యింది.

నాడు ఎంపీ..నేడు ఎమ్మెల్యే

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1957 అసెంబ్లీ ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. అనంతరం పెద్దపల్లి ఎంపీగా గెలుపొంది కేంద్ర జౌళిశాఖ మంత్రిగా పనిచేశారు. చెన్నూర్ అసెంబ్లీ స్థానానికి 2004లో వెంకటస్వామి పెద్ద కుమారుడు వినోద్ పోటీ చేసి గెలుపొందారు. 2009లో నల్లాల ఓదెలు చేతిలో ఓటమి పాలయ్యారు. 2018లో బెల్లంపల్లి నుంచి పోటీ చేసి వినోద్ స్వల్ప మెజార్టీతో ఓటమి పాలయ్యారు. 2023 ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. వివేక్ వెంకటస్వామి 2009లో పెద్దపల్లి ఎంపీగా గెలుపొందారు. 2014లో పెద్దపల్లి ఎంపీగా పోటీ చేసి బాల్క సుమన్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్‌పై పోటీ చేసిన వివేక్ వెంకటస్వామి ఘన విజయం సాధించారు.

ఒకరిపై రాళ్లతో దాడి

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన విజయోత్సవ ర్యాలీలో ఒకరిపై రాళ్ల దాడి జరిగింది. ఆదివారం రాత్రి మండలంలోని పెర్కపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు చేపట్టిన విజయోత్సవ ర్యాలీ బీఆర్ఎస్ నాయకుడు, గ్రామ కోఆప్షన్ సభ్యుడు రామగౌని అశోక్ గౌడ్ ఇంటి వద్దకు చేరుకుంది. ఇదే క్రమంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అశోక్ గౌడ్ ఇంటిపై రాళ్లు విసురడంతో అశోక్ గౌడ్ భార్య భాగ్యలక్ష్మి తలకు తగిలి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై తాళ్లగురిజాల ఎస్సై నరేష్‌ను వివరణ కోరగా ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.